క్లుప్తంగా

థ్యాంక్స్ సార్

నిధుల మంజూరుపై ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన పహాడీషరీఫ్ గ్రామస్తులు



ఎంపీ రంజిత్ రెడ్డిని సన్మానిస్తున్న పహాడీషరీఫ్ గ్రామస్తులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి చొరవ తీసుకొని హెచ్ఎండీఏ ద్వారా రూ.2.87 కోట్లు మంజూరు చేయించడం హర్షణీయమని 13వ వార్డు కౌన్సిలర్ పుష్పమ్మ అన్నారు. ఆ నిధులలో 13వ వార్డుకు సీసీ రోడ్డు కోసం రూ.35 లక్షలు కేటాయించడాన్ని పురస్కరించుకొని స్థానిక మహ్మదీయ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎంపీకి పూలబొకే అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు హమీద్‌ఖాన్, మాజీ వార్డు సభ్యులు సూర్యకుమార్ గౌడ్, ఖదీర్, నాయకులు విక్రాంత్ గౌడ్, విశాల్ గౌడ్, మినాజ్, ఇస్మాయిల్, ఆమెర్, అవేజ్ తదితరులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ వర్కర్స్ యూనియన్ బాలాపూర్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో పెంటయ్య

మీర్‌పేట: తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ బాలాపూర్ యూపీహెచ్‌సీ నూతన కమిటీని శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో సీఐటీయూ మండల బాధ్యులు పెంటయ్య, ప్రజాసంఘాల నాయకులు యాదయ్య సమక్షంలో ఎన్నుకున్నారు.కమిటీ అధ్యక్షురాలిగా లీలావతి, ప్రధాన కార్యదర్శిగా భాగ్యలక్ష్మీ, కోశాధికారిగా బి.సుజాత, కమిటీ సభ్యులుగా ఎం.సుజాత, డి.బాలమణి, సుమలత, వరలక్ష్మీ, హేమలత, అనిత, రజినీలు ఎన్నికయ్యారు. ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో రాజేశ్వరీదేవి



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఆలయ డైరెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.

అసమర్థ పాలనను ప్రజల్లో ఎండగడదాం

బీఆర్ఎస్‌పై మాజీ ఎంపీ బూర ఫైర్



బీజేపీ నేతలతో మాజీ ఎంపీ బూర నర్సయ్య

తుర్కయంజాల్: బీఆర్ఎస్ పార్టీ అవినీతి, అసమర్థ పాలనను ప్రజల్లో ఎండగట్టాలనే ఉద్దేశ్యంతోనే బీజేపీ శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్‌లను ఏర్పాటు చేస్తుందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధి ఉమర్‌ఖాన్ గూడలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కడారి శ్రీలత అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా గోసా-బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తుందన్నారు. బీజేపీ నాయకులు దయానంద్ గౌడ్, కొత్త అశోక్ గౌడ్, బచ్చిగళ్ల రమేష్, కొండ్రు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఏఓ

ఆమనగల్లు: వరిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు పొందాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణ కుమారి సూచించారు. ఆమనగల్లు మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వరిచేలో కాండం తొలచు పురుగు ఆశించినట్లు గుర్తించామని దీని నివారణకు పటేరా గుళికలు ఎకరాకు ఆరు కిలోలు వేసుకోవాలని సూచించారు. రైతులు జంగయ్య, బక్కయ్య, మహేశ్, వెంకటేశ్, శాంతమ్మ, పెద్దమ్మ తదితరులు ఉన్నారు.

శిథిల బురుజుకు నయా లుక్కు



శిథిలమైన బురుజు (ఫైల్)



పునర్నిర్మించిన తర్వాత బురుజు

- శతాబ్దంన్నర బురుజుకు మరమ్మతు
- విద్యుత్ దీపాలతో మరింత వెలుగు
- రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి

మీర్‌పేట: వందేళ్లకు పైగా చరిత్ర.. ఎన్నో పోరాటాలు, త్యాగాలకు సాక్ష్యం మన మీర్‌పేట గ్రామ బురుజు. శిథిలావస్థకు చేరుకున్న బురుజును తిరిగి అభివృద్ధి చేయడంతో కొత్త రూపు రేఖలు సంతరించకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నాడు గ్రామాల్లో రజాకారులు, దొంగల భయం ఎక్కువగా ఉండేంది. వారి కదలికలను ముందుగానే పసిగట్టేందుకు, రక్షణ కోసం పూర్వీకులు వందేళ్ల క్రితం మీర్‌పేట గ్రామం మధ్యలో బురుజు నిర్మించారు. గ్రామ రక్షణకు ఎంతగానో ఉపయోగపడడంతో పాటు పోరాటాలు, త్యాగాలకు బురుజు సాక్ష్యంగా నిలిచిందని గ్రామస్తులు తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన బురుజు కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. బురుజును కాపాడడంతో పాటు, దాని చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో పాలకులు గత సంవత్సరం బురుజు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

మంత్రి చొరవతోనే..



మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు బురుజు శిథిలమైంది. 150 ఏళ్ల చరిత్ర కలిగిన బురుజును రక్షించాలని మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె అవసరమైన నిధులు మంజూరు చేశారు. గతంలో 15 అడుగుల ఎత్తున్న బురుజు ప్రస్తుతం 25 అడుగుల ఎత్తు వరకు పునర్నిర్మించారు. బురుజు పై భాగాన ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలతో రాత్రివేళల్లో ఎంతగానో ఆకట్టుకుంటోంది.

– తీగల మాధవి, కార్పొరేటర్

రూ.40 లక్షల వ్యయంతో..

గ్రామస్తుల కోరిక మేరకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి బురుజు అభివృద్ధికి గాను రూ.40 లక్షల నిధులను కేటాయించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు పూర్తి కావడంతో బురుజు నూతన హంగులను సంతరించుకుని మీర్‌పేట వాసులను ఆకట్టుకుంటోంది. మరో వందేళ్లు బురుజు చెక్కు చెదరకుండా ఉండేలా ఆధునిక పద్ధతిలో పునర్నిర్మించడం విశేషం. బురుజును అభివృద్ధి చేయడంపై గ్రామస్తులు, పరిసర కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికులకే ‘డబుల్’ ఇళ్లు కేటాయించండి

బీజేపీ రాష్ట్ర మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానికులకు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్‌లో ప్రజా గోస- బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. సర్దార్‌నగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను స్థానికంగా ఉన్న నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. ఈ గ్రామంలో ఉన్న 131 సర్వే నంబర్‌లో ఉన్న వీకర్ సెక్షన్ కాలనీ రోడ్లు నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ కె.మధుమోహన్, కౌన్సిలర్లు రాజమౌని రాజు, వై.శివకుమార్, నాయకులు తాళ్ల అశోక్‌గౌడ్, మహేందర్, జపాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సొమ్ము అవినీతిపై మాట్లాడండి

- సర్వసభ్య సమావేశంలో ప్రతిపక్ష పాలకవర్గం సభ్యుల పట్టు
- ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ అర్ధంతరంగా ముగిసిన సమావేశం



సమావేశంలో సభ్యుల వాగ్వాదం

మంచాల: మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సభ్య సమావేశం రసాభాసగా మారింది. రైతుల సొమ్ము అవినీతికి పాల్పడ్డారని చైర్మన్ పుల్లారెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్యపై ప్రతిపక్ష పాలకవర్గ సభ్యులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. ఇరువర్గాల వాదనలతో సమావేశం అట్టుడుకింది. చివరకు పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సీఈఓ చింతకింది శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంకాగానే సహకార సంఘంలో జరిగిన అవినీతిపై మాట్లాడాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టారు. వరిధాన్యం కొనుగోలు విషయంలో రూ.32.60లక్షలు, భవన నిర్మాణ విషయంలో రూ.9లక్షలు, స్టేషనరీ విషయంలో రూ.7.50లక్షలు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతికి సంబంధించిన వివరాలను ఉన్నతస్థాయి అధికారులకు కూడా తెలియజేశాం అని చెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి రైతుల సొమ్ము అవినీతికి పాల్పడిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవడమే గాకుండా అందుకు సబంధించిన డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. నిజాయతీగా రైతులకు సేవ చేయకుండా అవినీతికి పాల్పడటం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. దీంతో ఒక్కసారిగా సమావేశం వేడెక్కింది. పోలీసులు జోక్యం చేసుకొని సభ నుంచి చైర్మన్, వైస్‌చైర్మన్‌ను పక్కకు తీసుకెళ్లారు. ఆరోపణల నడుమ సమావేశం అర్థాంతరంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో సభ్యులు హన్మంత్‌రెడ్డి, జెనిగె వెంకటేశ్, రమేష్, మణేమ్మ, వేణుగోపాల్, అరుణమ్మ, వింజమూరిరాంరెడ్డి, రైతులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు కేసీఆర్ మేనమామ



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళ

- బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి
- ఉప్పరిగూడలో పాదయాత్రకు ఆదరణ

ఇబ్రహీంపట్నం రూరల్: కల్యాణలక్ష్మీ, షాదీముబాకర్ పథకాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డలకు మేనమామగా నిలిచారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రగతి నివేదన పాదయాత్ర గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో కొనసాగింది. గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కొంతమంది నాయకులు కేవలం ఓట్ల కోసమే వచ్చి, ఓట్లు అయిపోగానే భయపడి గ్రామాల్లోకి రాకుండా తప్పించుకుంటారని తెలిపారు. కానీ మన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నిరంతరం ప్రజల కోసం ప్రజల్లో ఉంటారన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ, బీటీ రోడ్లు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత మరమ్మతులు చేశారని తెలిపారు. మిషన్ కాకతీయ, భగీరథ ద్వారా ప్రజలకు సాగుతాగునీరు అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు, డాక్టర్ సురేష్, ఎంపీటీసీ మంగ, నాగమణి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాలునొప్పి ఎలా ఉంది బిడ్డా..

ఇబ్రహీంపట్నం రూరల్: నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కాలుకు గాయం కావడంతో ఉప్పరిగూడలోని గుడారంలో విశ్రాంతి తీసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఉప్పరిగూడ గుడారం వద్దకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేరుకున్నారు. బిడ్డా కాలు నొప్పి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అంత ఇబ్బందిగా ఉంటే తాత్కాలికంగా రెండు రోజుల పాటు పాదయాత్ర వాయిదా వేయాలని కుమారుడు ప్రశాంత్‌రెడ్డిని కోరారు. ప్రజల ఆప్యాయత, అనురాగాల ముందు నా కాలు నొప్పి చిన్నదని, నాకోసం అడుగులో అడుగు వేస్తున్న కార్యకర్తల బలం ఉన్నంత వరకు నాకేమి కాదని.. పాదయాత్ర కొనసాగిస్తానని తండ్రి కిషన్‌రెడ్డికి బంటి తెలిపాడు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పాండురంగారెడ్డి, ఎంపీపీ పీ.కృపేష్, వైస్ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు బంటిని పరామర్శించినవారిలో ఉన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు

కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్

మీర్‌పేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని వీధి కుక్కలను నియంత్రించేందుకు కుటుంబ నియంత్రణ, రేబీస్ ఇంజెక్షన్‌లను వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వీధి కుక్కల నుంచి ప్రజలకు హాని కలుగకుండా ఉండేందుకు ఇప్పటికే శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్, సూపర్‌వైజర్లకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని కాలనీలలో ఎక్కడైనా కుక్కల బెడద ఉంటే వెంటనే మున్సిపల్ కార్యాలయంలోని సిటిజన్ సేవా సెంటర్ లేదా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫోన్-9963586496, పర్యావరణ ఇంజనీర్ ఫోన్-7729922257 నెంబర్లకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు.

తల్లి మందలించిందని..

ఇంటినుంచి వెళ్లిపోయిన బాలుడు



ఆయూష్ శర్మ (ఫైల్)

పహాడీషరీఫ్: ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కె.మధుసూదన్ కథనం ప్రకారం.. శ్రీరాం కాలనీకి చెందిన ఉమేశ్ శర్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. మూడు రోజుల నుంచి పాఠశాలకు వెళ్లకుండా ఫోన్‌లో గేమ్ ఆడుతుండటంతో పెద్ద కుమారుడు ఆయూష్ శర్మ(13)ను తల్లి బీనాదేవి ఈ నెల 23న మందలించింది. మనస్తాపానికి గురైన ఆయూష్ ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఉమేష్ శుక్రవారం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు పోలీస్టేషన్‌లో లేదా 94906 17241 నంబర్‌లో సమాచారం అందించాలని కోరారు.

దొడ్లపహాడ్‌లో కిసాన్ సమ్మాన్ దివస్

మాడ్గుల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంని రంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జక్కా రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దొడ్లపహాడ్ గ్రామంలో శుక్రవారం నమో కిసాన్ సమ్మాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించి కేంద్ర పథకాల ద్వారా రైతులకు జరుగుతున్న మేలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు పాపయ్యగౌడ్, అంజయ్యయాదవ్, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్, నర్సింహారెడ్డి, సుదర్శన్, వెకంటేశ్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, పెద్దయ్యయాదవ్ పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి కేటీఆర్‌కి సంఘం నేతల వినతి



కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వర్ణకారులు

బడంగ్‌పేట్: రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర నాయకులు మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉప్పల్ భగాయత్‌తో ఐదెకరాల స్థలాన్ని కేటాయించినందుకు కేటీఆర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉన్నామన్నారు. రాష్ట్రంలో పోలీసుల వేధింపుల కారణంగా స్వర్ణకారులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దొంగ బంగారం విషయంలో స్వర్ణకారులను పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. వెంటనే చర్యలు తీసుకుంటామని వారికి వివరించారు. మంత్రి కేటీఆర్‌ను కలిసిన వారిలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి రాఘవచారి, కార్యదర్శి స్వామిచారి, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణాచారి, బడంగ్‌పేట కార్పొరేషన్ ఉపాధ్యక్షులు ఈశ్వరోజు బాలేశ్‌చారి తదితరులున్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



ముచ్చర్లలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ తదితరులు

కందుకూరు: కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముచ్చర్ల సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ బక్క మల్లేశ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ముచ్చర్లలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందించే సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ధి పొందాలన్నారు. తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరిత, డాక్టర్ సాయిసౌమ్య, సీహెచ్‌ఓ కె.రవీందర్, వైద్య సిబ్బంది జి.లక్ష్మమ్మ, కె.బండెమ్మ, ఇ.ప్రేమలత, కె.శ్రీనివాస్, గౌసియా, యాదగిరి, అండాలు, మంజుల, మాధవి, మమత, అశోక్, పంచాయతీ కార్యదర్శి కె.ఇంద్రసేనారెడ్డి, వార్డు సభ్యులు సీహెచ్ మల్లేష్, కారోబార్ ఎం.యాదయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కార్పొరేటర్లను సన్మానించిన లక్ష్మీనగర్ కాలనీవాసులు

బడంగ్‌పేట్: ఎన్నికల కోడ్ కంటే ముందే ప్రారంభమైన పనులను శుక్రవారం పర్యవేక్షించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ సంతోషి, ఇతర కార్పొరేటర్లు జరుగుతున్న పనులను పరిశీలించారు. లక్ష్మీనగర్ కాలనీకి అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకుడు అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి కిరణ్, మాజీ అధ్యక్షులు ప్రమోద్, కృష్ణవేణి, రాజు, హనుమంత్, వెంకట్‌రెడ్డి,మల్లేష్, కేదర్‌నాథ్, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్



పాదయాత్ర చేస్తున్న నేతలను సన్మానించిన గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ పంచాయతీ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు తీర్చాలని కోరుతూ గత కొద్ది రోజులుగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం తులేకలాన్, కప్పపహాడ్, ఎల్మినేడు గ్రామాల్లో కొనసాగింది. పాదయాత్రలో పాల్గొన్న భూపాల్ మాట్లాడుతూ.. జీఓ 51ని రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దుచేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు దళితబంధు పథకం అమలు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5.5 లక్షలు ఆర్థికసహాయం అందించాలని కోరారు .బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి మహేశ్, వినోద్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్, సోమయ్య, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ పగడాల యాదయ్య, సీఐటీయూ కోశాధికారి కవిత, దయ్యాల కిషన్, జగదీష్, దేవాదాస్, నరేష్, బుగ్గరాములు, పంది జంగయ్య తదితరులు పాల్గొన్నారు .

గ్రామకంఠం భూమిని కాపాడండి

రోడ్డుపై బైఠాయించి ఇంజాపూర్ గ్రామస్తుల నిరసన



రోడ్డుపై బైఠాయించిన ఇంజాపూర్ గ్రామస్తులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ సర్వే నంబర్-7 లోని గ్రామకంఠం భూమిని కాపాడాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భర్త గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్ ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులను నిర్ణయిస్తే భూమిని కాపాడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నోముల కృష్ణాగౌడ్, మాజీ ఉపసర్పంచ్ బొక్క గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు కమల్‌రెడ్డి, పిట్ట సుదర్శన్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, నర్సింహాచారి, కృష్ణాచారి, కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి

- మీర్‌పేట పీహెచ్‌సీ ఎదుట ఆశ వర్కర్ల ఆందోళన
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హామీతో ఆందోళన విరమణ



మీర్‌పేట పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశవర్కర్లు

మీర్‌పేట: ఆటో ప్రమాదంలో గాయపడిన తోటి సిబ్బందిని వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని ఆశ వర్కర్లు శుక్రవారం మీర్‌పేటలోని బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుత.. గురువారం ఎంఆర్ సర్వే కోసం వెళ్తున్న ఆశవర్కర్ల ఆటో షాహీన్‌నగర్‌లో ప్రమాదానికి గురై ఇద్దరు వర్కర్లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులైన కవిత, సుమలతకు గాంధీ ఆస్పత్రిలో నామమాత్రంగా వైద్యం చేసి చేతులుదుపులన్నారని.. కనీసం వారికి బెడ్‌లు కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల నుంచి పీహెచ్‌సీలో వైద్య సేవలందిస్తున్న ఆశ వర్కర్ల పరిస్థితి విషమంగా ఉంటే కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రుల ఇద్దరికి ప్రైవేటు ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రతతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతారాణి ఆస్పత్రికి చేరుకుని ఆశ వర్కర్లతో మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, అదే విధంగా సిబ్బందికి విధుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.